# పనిముట్లన్నీ ఇచ్చి వెళ్లారు

యు.జి. శ్రీనివాసులు*

**బా**లగోపాల్‌గారి మరణవార్త వినగానే దు:ఖం వెల్లువెత్తింది.

బాలగోపాల్ గారితో పరిచయం, ఆయన ఆలోచనలు, ఆచరణా చాలామందిని ప్రభావితం చేసాయి. వాళ్ళల్లో నేనూ ఒకణ్ణి. ఆయన సామాజిక జీవితం మార్క్సిస్టు మేధావిగా మొదలయ్యింది. మన రాష్ట్రంలో హక్కుల సంఘాలు నక్సలైటు ఉద్యమాల నేపథ్యంలో ఏర్పడడం వలన ఎపిసిఎల్‌సి కార్యదర్శిగా పోలీసుల బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా చాలా కార్యక్రమాలు జరిగేవి. ఎంతో ధైర్య సాహసాలతో ఆయన ఈ కర్తవ్యాన్ని నిర్వహించారు. ఆయన ధైర్యం సమాజంలో చాలామందిని ఉత్తేజితుల్ని చేసింది.

బాలగోపాల్ కడవరకు కూడా సమాజ అధ్యయనానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. చుండూరు, కారంచేడు వంటి సంఘటనలు సమాజాన్ని ఒక్క కుదుపు కుదిపినపుడు ప్రభుత్వం పాల్పడుతున్న రాజ్యహింసపైనే కాకుండా కుల, లైంగిక ఆధిపత్యాలవంటి వ్యవస్థీకృత హింసల్ని సైతం వ్యతిరేకిస్తూ పోరాడవలసిన అవసరం గురించి ఆయన నొక్కి చెప్పారు. ప్రాధాన్యతల విషయంపై పౌరహక్కుల సంఘంలో భిన్నాభిప్రాయాలు వచ్చినా అన్ని సామాజిక సమస్యలపైనా ఉమ్మడిగానే పనిచేసాము. ప్రజల హక్కులకు భంగం వాటిల్లే ప్రతి అంశాన్నీ స్పృశించాము.

కర్నూలు జిల్లాలో బాలగోపాల్‌గారు మాతో కలిసి పనిచేయని సమస్య లేదు. కర్నాటక రాష్ట్రాన్ని ఆనుకుని ఉన్న కర్నూలు జిల్లా పడమటి ప్రాంతంలో దళితులపై దళితేతరులైన బోయ, గొల్ల, కురువ, ముస్లిం మొదలైనవారు దాడులకు

* **మానవహక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి, ఆదోని**

పాల్పడుతుండేవారు. వీరిమధ్య వైరుధ్యాలను వాడుకొని కమ్మ, రెడ్డి కులస్థులు రాజకీయంగా ప్రాబల్యం పెంచుకునేవారు. ఈ విషయం హక్కుల పరిధిలోకి వస్తుందని గ్రహించి మనం దృష్టి పెట్టాము. ఇలా బాలగోపాల్ గారు హక్కుల పరిధిని విస్తరిస్తూ పోయిన అనేక ప్రాముఖ్యం కలిగిన విషయాలపై పనిచేశాము. శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాస సమస్యపైనా, కర్నూలులో పేపరు మిల్లు, ఆదోనిలో కొఠారి స్పిన్నింగ్ మిల్లులు మూతపడి కార్మికులు రోడ్డున పడ్డప్పుడూ ఇదే ప్రాధాన్యం ఇచ్చాము. విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టడం వలన కార్యకర్తలకు సమాజాన్ని అధ్యయనం చేసే అవకాశాలు పెరగడం ఒక ఎత్తయితే, బాధితులు సాంత్వన పొందడం మరో ప్రయోజనం. హక్కుల సంఘం అజెండా విశాలం కావడాన్ని అందరూ ఆమోదించారు, కాని రాజ్యహింసకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలనే వారితోనే సమస్య మొదలయ్యింది. సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలకు వీరు 'సహాయ నిరాకరణ' ఆరంభించారు. ఆ క్రమంలో నేను నా జిల్లా బాధ్యతల నుంచి విరమించుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు బాలగోపాల్‌గారు నాకు నైతిక ధైర్యాన్నిచ్చి ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చేశారు. హక్కుల సంఘం అటు ప్రభుత్వానికీ, ఇటు నక్సలైట్లకూ వాణిగా కాకుండా 'మూడో గొంతుక'గా వ్యవహరించాలని బాలగోపాల్ గారు వాదించేవారు. తన వాదనకు సామాజిక ఆమోదం ఉందనే విషయాన్ని ఆచరణ ద్వారా నిరూపించారు.

మానవ హక్కుల వేదిక ఏర్పడిన ఈ పదేళ్ళ కాలంలో రాష్ట్ర వ్యాపితంగా సంస్థ ఎదగడానికి ఎంతో కృషి చేశారు. ప్రతి మనిషికీ ఒకే విలువ ఉండే సమాజాన్ని బాలగోపాల్ ఆకాంక్షించారు. ఈ ఉదాత్తమైన ఆశయాన్ని నెరవేర్చడం అంత సులభం కాదు. అసమానతలు తీవ్రమవుతున్న వర్తమాన సమాజంలో గొంతులేని వారి తరఫున మాట్లాడటం ఎంతో అవసరం. అందుకు అవసరమైన పరికరాల్నీ, వనరుల్నీ, ఆలోచనలనూ, అనుభవాలనూ, ఆచరణనూ మనందరికోసం మిగిల్చి వెళ్ళారు. భౌతికంగా మనకు దూరమయినా ఆయన మనకు వారసత్వంగా ఇచ్చిన సాధన సంపత్తితో ప్రతి మనిషికీ ఒకే విలువని సాధ్యం చేద్దాం.